# ఇది సంభవమే!

''ఐతే ఆ అమ్మాయి నచ్చినట్లే కదూ!'' అంది తల్లి.

''ఊ'' అన్నాడు చంద్రమోహన్.

ఈ మధ్యనే అతడు, తల్లి, అక్క అరుంధతి వెళ్ళి పిల్లను చూసి వచ్చారు.

అరుంధతి పురిటికి వచ్చింది పుట్టింటికి. ఆడపిల్ల పుట్టింది. ఇంకో రెండు నెలలు ఇక్కడే వుంటుంది. బాలింతరాలు. తాంబూలం వేసుకుంటోంది.

''బాగానే ఉందిరా అమ్మాయి. కళ్ళు కొంచెం ఎట్లాగో ఉన్నాయి'' అంది.

''నాకు బాగానే వుంది'' అన్నాడు చంద్రం నవ్వి.

''నీకు నచ్చితే సరే. ముహూర్తం పెట్టిస్తాం అక్క వెళ్ళేలోగానే'' అంది తల్లి సంతోషంగా.

ఈ సమావేశం జరుగుతుండగానే ఇందు చెప్పులు టకటకలాడించు కుంటూ కాలేజీనుంచి వచ్చింది. వస్తూనే -

''ముందర డబ్బులియ్యి అమ్మా. ఏభై రూపాయలు. మా ట్రిప్పుకి'' అంది.

''ఎక్కడికి వెడుతున్నారూ?'' అన్నాడు చంద్ర.

''బొటానికల్ టూర్... రేపు పొద్దున్న వెడుతున్నాం..... ఎల్లుండి రాత్రి బయలుదేరి వచ్చేస్తాం. ఇద్దరు లెక్చరర్లు, ఇద్దరు డెమాన్‌స్ట్రేటర్లూ అరవైమంది స్టూడెంట్స్ వెడుతున్నాం. అమ్మాయిలు ఇరవైరెండుమంది. ఉన్నాం. మా సుజాతా మేడం, మిస్ లీనా కూడా వస్తున్నారు. ఏం భయంలేదులే!'' అంటూ కనుబొమ్మలు ఎగరేసి నవ్వింది.

అరుంధతి పక్కన కూర్చుని ఆ స్థలాన్ని వర్ణించి చెప్తోంది ఇందు.

చంద్రమోహన్‌కి ఆమాటలేవీ వినిపించటంలేదు.

మనసులో ఒకమూల మచ్చలాగ దాక్కున్న భయం పొగలాగ మనసునిండా ఆక్రమిస్తోంది. విజృంభిస్తోంది.

''వొద్దు, నువ్వు వెళ్ళవద్దు'' అన్నాడు ఇందిరని చూస్తూ.

''ఆహా! ఎందుకనిట!'' అంది ఇందిర ఎగతాళిగా.

''ఎందుకేమిటి! వెళ్ళద్దు, అంతే'' అన్నాడు చంద్ర.

''వెడతాను. మార్కులు ఎల్లాగ వస్తాయి!'' అంది ఇందిర పెంకెగా.

''మార్కులు రాకపోతే మించిపోదు. నువ్వేం రిసెర్చి చెయ్యాలా? సరదాకేగా వెళ్ళటం.

''సరదాలు మాత్రం మళ్ళీ వస్తాయా! నేను రాకపోతే రాణి, చంపా ఊరుకోరు. పట్టి లాక్కెడతారు. ఐనా తాతయ్యలాగ మాట్లాడుతున్నా వేంటి! నీకంటే నాన్న నయం. అడగ్గానే వెళ్ళమన్నారు'' అంది.

చంద్ర పళ్లు కొరుక్కున్నాడు కోపం అణచుకోవటానికి.

''చెప్తుంటే నీక్కాదూ. కావలిస్తే మీ అమ్మాయిలంతా కలిసి విడిగా వెళ్ళండి''.

''విడిగానా! బొటానికల్ టూర్‌కి అమ్మాయిలు విడిగానా.''

పడిపడి నవ్వుతోంది ఇందిర. దానికి బాగా అబ్బాయిలతో మాట్లాడటం, డిబేట్స్‌కి వెళ్ళటం, రేడియో ప్రోగ్రాములకి వెళ్లటం అలవాటయింది. స్త్రీలకి ప్రత్యేక సదుపాయాలు అనవసరం అంటుంది. ఇప్పుడందుకే నవ్వులాటగా ఉంది.

ఆ నవ్వుతో చంద్ర రెచ్చిపోయాడు.... అరిచాడు.

''ఎందుకు నవ్వుతావూ! అంతమంది మగపిల్లలు! మంచి వాళ్ళుండరు అందరూను. రౌడీలుంటారు. వాళ్ళే ఎక్కువ. ఆడపిల్లలతో అవకాశం వస్తే....''

''ఏం కాదు. నాకు తెలీదనుకున్నావా? మంచివాళ్ళే ఎక్కువ. సరదాకి అల్లరి చేస్తారంతే. ఆడపిల్లలు మాత్రం తక్కువనుకుంటున్నా వేమటి? వాళ్ళూ మగపిల్లల్ని ఏడిపిస్తారు. మా రాజారావు, సుబ్రహ్మణ్యం ఎంత మంచివాళ్ళో! ఎవరేనా మా జోలికి వస్తే ఊరుకోరు.''

''ఐతే అయ్యారు. వెళ్ళొద్దు!'' అన్నాడు మళ్ళీ చంద్ర,

''ఎందుకు వీల్లేదు.... నీ ఇష్టమేమిటి'' అంది ఇందు.

అరుంధతి వారిస్తూ అంది.

''వాణ్ణి అట్లాగనకే, వాడు పెద్దవాడై పోతున్నాడు. పెళ్ళి ముహూర్తం పెటిస్తోంది అమ్మ''

ఇందిర సంతోషంగా చంద్ర చెయ్యి పట్టుకుని ఊపేస్తూ.

''సారీ కంగ్రాట్స్! మరి వదిన్ని ఎప్పుడు చూపిస్తావ్!'' అంది.

''నీకు తీరికేది... డిబేట్స్, టూర్‌లూనూ....'' అంది తల్లి.

* * *

రెండు రోజులూ గడిచిపోతున్నాయి. చంద్ర ఉండి ఉండి ఉలిక్కిపడు తున్నాడు. ఎక్కడినుంచో టెలిగ్రామ్ వస్తుందనిపించేది.

''ఇందిరా కమిటెడ్ సూయిసైడ్'' అని.

పేపర్ చూస్తుంటే ''విద్యార్థులు బలత్కారం చేసిన కారణంగా బొటానికల్ టూర్‌కి వెళ్ళిన ఒక అమ్మాయి విషం తాగి మరణించింది'' వంటి వార్తకోసం చూసేవాడు. పడుకుంటే.... ఇందిర ఏడుస్తూ తలుపు గబగబ బాదుతున్నట్లనిపించేది.

రెండురోజులు గడిచిపోయాయి. మూడవ రోజు పొద్దున్నే ఇందిరావాళ్ళు తిరిగి వచ్చారు. రాణి, చంపా ఇంటిదాకా వచ్చి టా, టా చెప్పి వెళ్ళారు. ఇందిర మొహం ఎప్పటిలాగ లేదనిపించింది చంద్రానికి. మనిషిలో ఆ పొంగి పొరలే ఉత్సాహం చల్లారిపోయినట్లుగా అనిపించింది. పరిశీలనగా చూస్తూ -

''బాగా అయిందా మీ టూరూ'' అన్నాడు.

''ఆ అయింది. మామటుకూ బాగానే అయింది'' అని ఆవేశం తరుముకువస్తుంటే

''నువ్వు చెప్పిందే నిజం. వాళ్ళంతా చాలా మంచివాళ్ళనుకున్నాను. ఛీ....ఛీ....ఛీ... అవకాశం రానంతవరకే మంచితనం. మనిషి తోలు కప్పుకుంటారు. అవకాశం రాగానే పశువులైపోతారు....''

''ఏమయిందే..... అసలు'' అంటూ అరుంధతి అక్కడికి వచ్చింది.

ఇందిర కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

''మేము వెళ్ళినప్పుడే ఇంకో బాచ్, విమెన్స్ కాలేజీ పిల్లలు వచ్చారు. వాళ్ళది వేరే కాంపు. మేము వెళ్ళినరోజు రాత్రి - అంటే మొన్న రాత్రి భోజనాలు చేశాక అందరం చాలాసేపు పాటలు పాడుతూ, జోక్స్, టీజర్స్ చెప్పుకుంటూ చాలా హేపీగా గడిపాం... అర్ధరాత్రిదాకా. తరువాత మేం వచ్చి పడుకున్నాం. మాకు తెలీదు ఏమయిందో. కొంతమంది మగపిల్లలు వాళ్ళ గదిలోకి డ్రింక్స్ తెచ్చుకున్నారట. త్రాగి అల్లరి చేశారుట. అది చాలక విమన్స్ కాలేజీ ఆడపిల్లల కాంప్‌కి వెళ్ళి లైట్లు ఆర్పి, దొరికిన ఆడపిల్లను పట్టుకుని బలాత్కారం చేసి

వచ్చారుట. బయటికి చెప్పుకుంటే పరువు పోతుందని ఇళ్ళలో కొప్పడతారని, ఎవరూ నోరు విప్పరని వాళ్ళ ధీమా. తెల్లవార వస్తుంటే ఒక అమ్మయి వెళ్ళి అక్కడ ఉన్న బావిలో పడిందట. వెంటనే తీసి హాస్పిటల్లో చేర్చారన్నారు. బతికిందో లేదో తెలీదు. మేము స్పెసిమన్స్ కలెక్టు చెయ్యటానికి వెళ్ళాం... మరిచిపోకుండా ఉన్నాను. తలుచుకుంటే నాకెట్లాగో అయిపోతోంది... అది నేనే ఐతే!''

చంద్ర మొహం పాలిపోయింది. అరుంధతి కళ్ళనిండా సానుభూతి ''పాపం'' అంది.

''అది నేనైతే... ఇంటికి వచ్చేదాన్నా. వస్తే. రాగానే మీరేం చేసేవారు! ఇంట్లోకి రానిచ్చేవారా? ఆ అమ్మాయికి పెళ్ళవుతుందా? ఒకవేళ ప్రెగ్నెంట్ అయితే? తను చెయ్యని తప్పుకి....'' ఇందుకి గొంతు పూడుకుపోయింది.

''ఎందుకే అట్లాగ బాధపడతావు... ఏమీకాదు ఊరుకో'' అంది అరుంధతి.

''ఊరుకోవాలా? ఇట్లాగ ఎందుకవ్వాలి? ఆడపిల్లలు చదువుకోకూడదా? ఎక్కడికీ వెళ్ళకూడదా?''

''చదువుకోకూడదని ఎవరంటారూ? తిరగకూడదు. మగవాళ్ళకి దూరంగా ఉండాలి!'' అన్నాడు చంద్ర.,

ఇందు క్రింది పెదవి మెలికలు తిరుగుతోంది.

''ఐతే యాభైఏళ్ళనుంచి మనదేశంలో స్త్రీ అభ్యుదయం అంటూ చేసిన కృషి అంతా వృధా అన్నమాటే గదూ. వంటింట్లోనే ఉండడానికి, మగవాళ్ళ కంటపడకుండా వుండాల్సి వస్తేనూ ఇంకా వాళ్ళకి చదువెందుకూ సంస్కార మెందుకూ, మార్కులెందుకు? పోనీ ఇవన్నీ ఉపయోగించుకోటానికి పెళ్ళి సంసారంగాక ఇంకా వేరే జీవితం ఉందా ఈ ప్రపంచంలో!''

''ఎందుకే ఇందూ ఆవేశపడతావు! అక్కడక్కడ కొందరుంటారు దుష్టులు. వాళ్ళవల్ల హాని జరుగుతుందని కాని దానికోసం స్త్రీలు ఇంట్లో కూచోకూడదు. ఆ అంధకారంలోంచి బయటికి వచ్చాం. మళ్ళీ వెనక్కి వెళ్ళకూడదు. స్త్రీ చదువూ సంస్కారం పొందాక, సంసారంలో బాధ్యతల్ని హక్కుల్ని పంచుకున్నాకే సంసారాలు సుఖంగా సాగుతున్నాయి ఇప్పుడు'' అంది అరుంధతి.

''నేను అలాగే అనుకున్నాను అక్కా. రాజారావ్ చాలా మంచివాడనుకున్నాను. నిజంగా మంచివాడే అసలు. ఆరాత్రి ఎందుకట్లాగ బిహేవ్ చేశారో! అంతా కలిసి తాగటం, డాన్సు చెయ్యటం, జుట్టు పెంచుకోవటం మేమెవరం తప్పుగా అనుకోం. పైగా ఎడ్మైర్ చేస్తాం. కాని ఒక

ఆడపిల్లని బలాత్కారం చేశారంటే హారిబుల్....కాంట్ ఇమాజిన్. ఆ పిల్ల ఇష్టపడితే వేరే సంగతి.

ఇది ఎంత అవమానం. ఔను. బావిలో పడింది.

అరుంధతి ఇందిరని నిశితంగా చూస్తూ ఎంత ఎదిగింది ఇందూ అనుకుంటోంది.

''నిజమే. మొగవాళ్లలో ఎక్కువమంది పశువులు. కనుక తమని రక్షించుకోటానికి ఆడపిల్లలు వాళ్ళకు దూరంగా వుండాలి. వాళ్ళతో కలిసిమెలసి ఉండాలని కోరుకోటం మూర్ఖత్వం. సమానత్వమనేది అర్థంలేని మాట. స్త్రీ దేవత. మగవాడు పశువు. పెళ్ళి చేసుకోవడంకంటె ఒక గుంజకి కట్టుకోవటం నయం.

అసలు ఇంతమంది పెళ్ళి చేసుకుని ఈ మగవాళ్ళతో సంసారాలు ఎట్లా చేస్తున్నారో నాకు అర్థం కావటం లేదు'' అంది ఇందు మళ్ళీ.

''అందుకని వెనుకడుగు వెయ్యకూడదు ఇందూ. చక్కదిద్దటం, సాధించటం నేర్చుకోవాలి'' అంది చల్లగా నవ్వుతూ అరుంధతి.

''శీలాన్ని కోల్పోయినా సరేనా?''

''పోయినాసరే. ఫరవాలేదు. ఏమౌతుంది? ఎక్కువమంది మగవాళ్ళు రౌడీలైతే శీలం పోయిన పిల్లలే భార్యలుగా వస్తారు. పెళ్ళిళ్ల ఆగవుకదూ? ఈ తరం వాళ్ళకి శీలం గురించిన బాధ లేకపోతే ఏమౌతుంది మరి? మంచివాళ్ళుకూడా బాధపడతారు. మెజారిటీ ప్రభావాలు సంఘం మొత్తంగా అనుభవించక తప్పదు''.

అరుంధతి మాటలతో ఇందు ఆశ్చర్యపడుతోంది. చంద్ర మాట్లాడలేకపోయాడు. శీలానికి విలువ పోయినా ఫరవాలేదు. స్త్రీ ప్రగతి వెతుక్కోవాలి అంటుంది అరుంధతి. ఆ మాటల్లో వ్యంగ్యం ఉంది. ఆవేదనా, అసహ్యమూ వున్నాయి.

చంద్ర తల వంచుకుని అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

తను ఉషని మరిచిపోలేదని అప్పుడే తెలిసింది అతడికి.

అతడికి భయం వేసింది. భయం మనసులో కూర్చున్నట్లుగా ఉంది.

ఇందు మామూలుగా డిబేట్స్‌లో పాల్గొంటూనే ఉంది. మగపిల్లలతో మాట్లాడుతూనే ఉంటుంది. కానీ వాళ్ళని ఇప్పుడు నిశితంగా చూస్తుంది. ఎవరినీ నమ్మదు. పెళ్ళి చేసుకోకూడదు. మగవాళ్ళతో స్నేహం చేయకూడదు అంటూనే వుంటుంది. ఆ పిల్లెవరో గుర్తువస్తే.... చూడకపోయినా..... తెలియకపోయినా...

మనసు వికలమై పోతుంటుంది. అరుంధతి వెళ్ళిపోతుందని వెంటనే ముహూర్తం పెట్టించారు. చంద్రకి పెళ్ళి అయింది. పెళ్ళిచూపులప్పుడు మీనాక్షి బాగానే వుందనుకున్నాడు కానీ ఇప్పుడు తెలిసింది తను అనుకున్నంత బాగాలేదని. బాగా డ్రెస్ చేసుకుంటే తెలీలేదు. జట్టు పలచన. నవ్వితే కళ్ల గుంటలు పడినట్లుంటాయి. ఐనా ఇప్పుడు తన భార్య. మీనా అంటే ఏదో ఆకర్షణ... మమత... ఇప్పుడు. కానీ మీనా చాలా ముభావంగా ఉంటుంది. పెళుసుగా మాట్లాడుతుంది. కట్నం బాగానే ఇచ్చారు. పెళ్ళి కూడా బాగానే చేశారు. అన్ని వేడుకలూ జరిగాయి. మీనాతో కొంచెం చనువు ఏర్పడింది చంద్రకి.

''ఈ చీర కట్టుకో...'' అని చూపిస్తే అది తనకి నచ్చలేదంటుంది.

''సినిమాకి వెడదాం'' అంటే నిద్ర వస్తోంది అంటుంది.

లేకపోతే నాకు ఈ సినిమాలు నచ్చవు అంటుంది.

పెంకితనం ఉంది బాగా. ఈకాలం ఆడపిల్లలు ఎవరు మాత్రం మాట వింటున్నారు కనుక!

ఇందు మాత్రం అనుకున్నాడు చంద్ర. సర్దుకుపోతున్నాడు.

అట్లాగ పదిరోజులు గడిచాయి కానీ మీనాలో మార్పులేదు.

వంట్లో బాగుండలేదు అంటుంది. తలనొప్పి, నీరసం అని పడుకునే ఉంటుంది.

చంద్రకి సరదాలు తీరటం లేదు. కోపం, విసుగు అణుచు కుంటున్నాడు.

ఆరోజు పడుకోటానికి వెళ్ళాడు. అప్పటికే మీనా పడుకుని ఉంది.

''తలనొప్పిగా ఉంది'' అంది అతడు పలకరిస్తే.

చంద్రకి కోపం వచ్చింది.

''ఎప్పుడూ తలనొప్పే. ఇంకెలా నీతో!'' అన్నాడు.

మీనా లేచి కూచుంది. మొహంలో ఒక నిశ్చయం. తెగింపు.

''ఔను, నాతో కష్టమే. మీకు ఉన్నది ఉన్నట్లు చెప్తేనే నయం. మీరు నా భర్తకదా నాకు మనసు బాగుండలేదు. వంట్లో బాగుండలేదు. అసలు నాకు పెళ్ళి ఇష్టం లేదు. ఈ పెళ్ళేకాదు, ఏ పెళ్ళీనూ. నాకు ఇప్పుడు రెండవనెల....'' అని ఆగింది.

చంద్ర మొహం పాలిపోయింది. అతనికి మీనా ఏమంటుందో అర్థమయినట్లుగా లేదు.

''ఏమిటంటున్నావూ.....'' అన్నాడు హీన స్వరంతో.

పొంగుతున్న అభిమానాన్ని, అహంకారాన్ని తన మనసులో ఒదిగి ఉన్న భయం అణిచేస్తోంది. ఆ భయంలోంచి చీకటి బయలుదేరి తనని కప్పివేస్తున్నట్లుగా ఉంది. అతడికి ఊపిరి ఆడటంలేదు. ఏమీ కనిపించటంలేదు. శరీరం వణుకుతోంది, మనసు చీకటి ముద్దలాగా అయిపోతోంది.

మీనా మళ్ళీ అంది :

''ఇందులో నా తప్పు లేదు. నేను కావాలని చేసుకోలేదు పెళ్ళి. మీరు మాత్రం కావాలని చేసుకున్నారా? మీ పెద్దవాళ్ళు చేస్తే చేసుకున్నారు. కట్నం తీసుకుని ముహూర్తం పెట్టించి మూడు ముళ్ళు వెయ్యమంటే వేశారు. నేనూ అంతే. నేను వద్దంటున్నా వినకుండా ఈ పెళ్ళి చేశారు. నా చేతిలో వుంటే చేసుకునేదాన్ని కాదు. చచ్చిపోయి ఉండేదాన్ని. నేనెవర్నీ ప్రేమించలేదు. మీకు అన్యాయం చేయాలనుకోలేదు. పెళ్ళిచూపులనాటికి అందరికి లాగా పెళ్ళిని గురించి నాకూ మధురమైన కల ఉండేది. తరవాత... మేం టూర్‌కి వెళ్ళాం. బోటనీ స్టూడెంట్స్, నేను. నేను విమన్స్ కాలేజీలోనే చదివాను. నాకెవరూ బాయ్‌ఫ్రెండ్సు లేరు. ఐతేనేం - ఆరోజు రాత్రి మేము పడుకుని ఉండగా లైట్లు ఆరిపోయాయి. మా గదిలోకి రౌడీలు వచ్చారు. మిగతావాళ్ళ సంగతి నాకు తెలియదు. నేనెవరికో దొరికిపోయాను. స్పృహ తప్పేవరకూ ప్రతిఘటించాను! స్పృహ వచ్చాక నాకు ఒక్కటే దిక్కు కనిపించింది! పరుగెత్తి వెళ్ళి బావిలో దూకాను. కానీ నన్ను బ్రతికించారు. మా లెక్చరర్లూ డాక్టర్లూ కలిసి బ్రతికించారు.

వాళ్ళు నన్ను బ్రతికించారు! అమ్మావాళ్ళూ నాకు పెళ్ళిచేశారు! ఇప్పుడు మీ భార్యనయ్యాను. ఇందులో నా ప్రమేయమేమీ లేదు.

ఏం చేసినా మీ ఇష్టం.

నా గొంతు పిసికినా నేను బాధపడను.

బాధపడటానికి నా దగ్గర ఏమీ లేదు. నా మనసు చచ్చిపోయింది. ఆశలు చచ్చిపోయాయి. శరీరంమీద అభిమానం అప్పుడే పోయింది. ఇంక బ్రతకాలి గనక బ్రతకాలి. చావలేకపోయాను గనక బ్రతకాలి. మీకు ఏం చెయ్యటానికైనా హక్కు ఉంది. ఎక్కడో ఎవరో విసిరివేయగా మీ దోవలో మీ కాలిముందు పడిన రాయిని నేను. మీ ఇష్టం - తన్ని పారేసినా సరే. దొర్లుకుంటూ మళ్ళీ అది ఎక్కడికో... ఎవరి కాలికిందికో... ఇంక నన్ను విసిగించకండి. చెప్పానుకదూ, నాకు వంట్లో బాగుండలేదు. మీరు పొమ్మంటే వెళ్ళిపోతాను, మీ ఇష్టం.''

మీనా మళ్ళీ పడుకుంది. అతడితోగానీ, ఈ ప్రపంచంతోగానీ సంబంధం లేనట్లు మగతగా పడుకుంది.

చంద్ర పిడికిలి బిగుసుకుంది. ఏదో, ఎవరిమీదో తెలియని కసి. సహించలేనితనం అతడిని ఊపివేస్తున్నాయి. ఎంత మోసం అనిపించింది. విసురుగా ఏం చెయ్యాలో ఆలోచించకుండానే బయటకు వచ్చాడు.

వరండాలో వెన్నెల్లో అరుంధతి కూర్చుంది. పక్కనే ఇందూ, అమ్మా వున్నారు.

రేపే అరుంధతి ప్రయాణం. అందుకని కబుర్లు చెప్పుకుంటున్నారు.

''మీనాకి ఎట్లాగుంది? తలనొప్పిగా ఉందంది. డోక్కుంది. నిద్ర పట్టిందా?'' ఆప్యాయంగా అడిగింది అరుంధతి.

''ఊ'' అన్నాడు. గేటుదాకా వెళ్ళాడు.

అరుంధతి పిలిచింది.

''ఇప్పుడెక్కడికి వెడుతున్నావ్! సిగరెట్స్ కావాలా? డ్రాయర్‌లో ఉన్నాయి. మీనా లేస్తుందేమో! ఏమన్నా కావాలేమో. దగ్గర ఉండు'' అంది.

చంద్ర లోపలికి వచ్చాడు. గదిలోకి వెళ్ళాడు. మీనా కదలకుండా పడుకుని ఉంది. మీనాని చూస్తుంటే ''సహించలేను'' అంటోంది అతడి మనసు. కుర్చీలో కూలబడ్డాడు. అతడిలోనే ఇంకొక గొంతు.

''సహించక ఏంచేస్తావ్! ఉషని మరిచిపోయావా? నువ్వు మాత్రం ఏం చేశావూ'', అంటోంది. చంద్ర తల పట్టుకున్నాడు కళ్ళు మూసుకున్నాడు. మనసులో ఉన్న చీకటిలో ఉష రూపుదిద్దు కుంటోంది.

ఇంజనీరింగ్ ఫైనలియర్‌లో ఉండగా ట్రైనింగ్‌కి వెళ్లారు.

వాళ్ళ బాచ్‌లో ఇద్దరే అమ్మాయిలు ఉండేవారు. ఉష, కుముద.

కంపెనీ వర్క్స్ చూడటంలో పగలంతా గడిచేది.

సాయంత్రం సినిమాకో, సైట్ సీయింగుకో వెళ్ళేవారు. ఉష వచ్చేదికాదు సాధారణంగా. ఉష, కుముద విమెన్స్ హాస్టల్లో ఉండేవారు. కుముద అన్ని చోట్లకీ వెళ్ళేది. ఆ అమ్మాయికి ఆ బాచ్‌లో వాడే సంపత్‌తో ఎంగేజ్‌మెంటు అయింది. ఇద్దరూ సరదాగా తిరిగేవారు. ఆరోజు పార్టీకి కుముద మరీమరీ పిలవగా ఉష వెళ్ళింది. ఇంజనీరింగ్ స్టూడెంట్స్ అంటే చిన్నపిల్లలు కాదు. జ్ఞానం బాగా ఉన్నవాళ్ళే. యవ్వనవేళలో కొన్ని తొందరపాటు క్షణాలు దాపురిస్తుంటాయి. అంత పెద్ద సూర్యుణ్ణి ఒక చిన్న మేఘం కప్పేసినట్లు ఆ క్షణాలు



5

మనిషి జ్ఞాన సర్వస్వాన్నీ హరించివేస్తాయి. ఆధునికులమనే అతిశయం దానికి తోడైతే.... పార్టీలో డ్రింక్స్ కూడా ఒక భాగం. కొంచెంసేపుండి ఉష వెళ్ళిపోతానంది. ఎవరూ వినిపించుకోలేదు. రికార్డు ప్లేయర్ వాద్యాలు వినిపిస్తుంటే డాన్సు చేస్తున్నారు.

''యూ టూ కమ్ అండ్ జాయినజ్ ఉషా'' అని ఎవరో అడిగారు.

ఉష ఒప్పుకోలేదు. ఉషని బలవంతంగా లాక్కెళ్ళారు. ఒకడు ఉషని ముద్దుపెట్టుకున్నాడు. తప్పించుకుని పరిగెత్తుతూ పక్కనే ఉన్న గదిలోకి వెళ్ళింది ఉష. ఉష వెంటబడ్డారు ముగ్గురు స్టూడెంట్స్. అందులో చంద్ర కూడా ఉన్నాడు. మిగతావాళ్ళు నవ్వుతున్నారు. వద్దన్నవాళ్ళు ఉన్నారో లేదో తెలీదు. ముగ్గురూ కలిసి ఉషని గదిలో బంధించి బలవంతం చేసి... ఏం చేశారో.. తెలివి వచ్చేసరికి ఉష లేదు. ఏమైంది ఉష! చదువు మానేసి వెళ్ళిపోయింది. ఉషకి అప్పటికే పెళ్ళయింది. భర్త అమెరికాలో ఉన్నాడు. ఉష కూడా ప్రెగ్నెంట్ అయిందా? తిరిగి వచ్చిన భర్తకి ఉష ఏం చెప్పుకుని ఉంటుంది? అతడేం చేశాడు?

పెళ్ళినాటికే భార్య గర్భవతి! గుండెలో మంట.

ఉష తనకేమీ కాదు. చెల్లెలు కాదు, భార్య కాదు. ఆ పిల్ల గురించి మళ్ళీ ఆలోచించవలసిన అవసరం వస్తుందనుకోలేదు. మరిచిపోయాననుకున్నాడు. అది ఇట్లాగ వెంటాడుతుందని తెలియదు. ఈ చీకటి తనను మింగేసినా బాగుండును.

తను ఉషకి కలిగించిన స్థితే ఎవరో మీనాకి కలిగించారు. తన భార్యకి కలిగించారు. ఐనా తను సహించలేకుండా వున్నాడు.

యువకులారా త్రాగండి, జల్సా చెయ్యండి, జట్టు పెంచుకోండి, గుడ్డలు విప్పి పరుగెత్తండి, ఏమైనా చెయ్యండి. కానీ స్త్రీ విషయంలో మాత్రం జాగ్రత్తగా ఉండండి. పొరపాటున కూడా తొందరపడకండి.

ఈ ప్రపంచం అందంగా ఉండాలంటే, మీ జీవితం విషం కాకుండా ఉండాలంటే పర స్త్రీని సోదరిలాగ గౌరవించండి, తల్లిలాగ అభిమానించండి.

నేను కూడా పురాణ వాక్యాలు పలుకుతున్నాను.

ఔను. అదే నిజం. తను ఎంత వెధవైనా, ఎంతమంది స్త్రీలని చెరిచినా తన భార్య మాత్రం శీలవతి కావాలి. తన భార్యని ఎవరైనా చెరిస్తే సహించలేడు.

అది అతడి గుండెలో మంట.

అది చెల్లెలు కాదు, నా భార్య కాదు అని సంతోషించకండి.

రేపు నీ ఇంటికే నీ భార్యగా కాకపోతే నీ తమ్ముడి భార్యగానో, నీ కోడలుగానో రావచ్చు.

స్త్రీ విషయంలో మాత్రం జాగ్రత్తగా ఉండండి.

ఈ విషయంలో మాత్రం ఆధునికత లేదు. పురాతనత లేదు. అది మారని విలువ.

పెళ్ళికి ముందరే కడుపుతో ఉన్న భార్యని ఎవడూ.....

తనకు మతిపోతుందనుకున్నాడు చంద్ర. తల విదిలించాడు.

కళ్ళు తెరిచాడు. ఎదురుగుండా పడుకుని ఉంది మీనా.

నిద్రపోతున్న మీనా మొహం -

''నాకు ఏమీ తెలీదు. మీ ఇష్టం వచ్చినట్లు చెయ్యండి. నా గొంతు పిసికినా సరే. బాధపడను. నాకు మనసు లేదు. గాలికి కొట్టుకుపోతున్న పూవుని'' అంటున్నట్లుగా ఉంది.

లేచి మీనాని చూస్తూ నుంచున్నాడు.

ఉష భర్త ఏం చేశాడు? ఉషని క్షమించాడా? అతడు వచ్చేవరకూ బ్రతికి ఉందా ఉష! అతడు తిరస్కరించాడా? ఉష ఏం చేసింది? ఉష ఏమైంది? ఎంత దారుణం చేశానూ!

అతడి గుండెలో ఎంత మంట రగిలించానూ.

ఉష జీవితంలో ఎంత విషం కలిపానూ!

నాకు తెలీదు ఉషా. ఇప్పుడు మీనాని ఇట్లాగ చూస్తేకానీ ఆ గుండెమంట నాకు తెలీలేదు. తెలిస్తే అట్లాగ చేసేవాడిని కాదు. నేనూ మనిషినే - నన్ను క్షమించు ఉషా.... క్షమించు''

రాబోతున్న వెక్కిళ్లు ఆపుకున్నాడు చంద్ర. మంచంమీద కూచున్నాడు. మీనా నుదుటిమీదపడిన ముంగురులు సవరించాడు. చేతి వేళ్ళను నిమిరాడు. నిద్రలో మీనా అతడి చేతిని గట్టిగా పట్టుకుంది... భయంతో పట్టుకుంది. ఒక్కసారిగా అతడి మనసు మూలల్లో ఉన్న భయం వదిలిపోయింది.

చీకటికూడా తెల్లవారినట్లుగా మాయమైపోయింది.

ఆంధ్రజ్యోతి వారపత్రిక, 11-1-1975

* * * *